మెట్టలో వరి కోతలకు సన్నద్ధం

- వాతావరణ పరిస్థితులతో ఆందోళనలో అన్నదాతలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్న రైతులు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెలలో తుఫాన్లు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారుల ప్రకటనలు చూసి మెట్ట రైతులు కోతలకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి కోతలకు సమాయత్తమయ్యారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం సబ్‌డివిజన్ పరిధిలో 8,228 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో వరి పంట కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. మాసూళ్లు ప్రారంభం కావడంతో పండిన ధాన్యాన్ని విక్రయించి వచ్చిన సొమ్ముతో అప్పులు తీర్చుకుని మిగిలిన సొమ్ము ఖరీఫ్ సాగుకు పెట్టుబడులకు ఉపయోగించుకుంటామని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల్లో కూలీల కొరత ఉండటంతో వరి కోత యంత్రాలపై రైతులు ఆధార పడుతున్నారు.


మెట్ట ప్రాంతంలో వరికోత యంత్రాలతో కోతలు కోయిస్తున్న రైతులు

వరి కోత మిషన్ అయితే గంటకు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు చెల్లించి కోతలు కోయిస్తున్నారు. కూలీలతో అయితే కోతలు కోసి ధాన్యం ఆరాక కుప్పలు వేసి, నూర్పిళ్లు చేపట్టేవారు. యంత్రాలతో అయితే ఒకేసారి కోతతోపాటు ధాన్యం నూర్పడం కూడా పూర్తవుతుండటంతో యంత్రాల కోసం రైతులు ఎగబడుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వరికోత యంత్రాల యజమానులు ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరించాలి. రైతులకు మద్దతు ధర చెల్లించి అన్ని రకాలుగా సహకారం అందించాలి.
–గద్దమడుగుల రాజేష్‌నాయుడు, రైతు, చింతలపూడి

టార్పాలిన్లు పంపిణీ చేయాలి



చింతలపూడిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి. ఒక పక్క రబీ పంట మాసూళ్లు ప్రారంభమయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేయాలి.
టి.బాబు, సీపీఐ మండల కార్యదర్శి, చింతలపూడి

సారా నిందితుడిపై కేసు నమోదు

కామవరపుకోట: మండలంలో కొండగూడెం శివారులో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు సీఐ భోగేశ్వరరావు ఆధ్వర్యంలో నాటు సారా బట్టీలపై గురువారం దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన చీకట్ల రమేష్ నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే రమేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, అతడికి బెల్లపు ఊటను సరఫరా చేసిన జూలూరి కిరణ్‌పై పరారీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలో పాత సారా కేసులో పరారీలో ఉన్న జలపవారి గూడెం గ్రామానికి చెందిన జువ్వాల సత్యవతి, వెంకటాపురం గ్రామానికి చెందిన రాజులపాటి దుర్గారావు, ఆడమిల్లి గ్రామానికి చెందిన మిరియాల శరత్ కుమార్, బెల్లం సరఫరా చేసిన టి.నరసాపురం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన రాచప్రోలు మల్లికార్జునరావులు నలుగురిని అదుపులోకి తీసుకొని చింతలపూడి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ వీరికి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి


పోలవరం రూరల్: మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు


కొయ్యలగూడెం: రైతులను సత్కరించిన వ్యవసాయాధికారులు

పోలవరం రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సూచించారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నవ ధాన్యాలు, ప్రకృతి వ్యవసాయానికి జీవామృతం, పంచగవ్య వాడకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే ఉత్తమ రైతులను ఎంపిక చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన మానవుని జీవన ప్రమాణం పెరుగుతుందని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రతి రైతూ వీటిని పాటించి ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి రైతులకు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు, కరిబండి నాగరాజు, కె.ప్రసాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

కొయ్యలగూడెం: యర్రంపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సదస్సు గురువారం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి సంజీవరావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు నవధాన్యాలు, పచ్చిరొట్ట పెంపకం ఉపయోగాలను తెలియజేశారు. రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండి తగు సలహా సూచనలు ఇస్తూ అవసరమైన కషాయాన్ని సీజన్‌కి ముందుగానే అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తూ ఆదర్శంగా నిలిచిన రైతులు ముల్లపూడి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు, నరేంద్ర, రమేష్ సన్మానం చేశారు. రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుజాత, రవి, పాపారావు, సావిత్రి జ్యోతి, సత్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

గణపవరం: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు మంజూరుకు కృషి చేస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర భవిత కేంద్రంలో ఆయన దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. పిప్పర 5వ వార్డు పాఠశాల చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛను రూ.6వేలు ఇస్తామన్న హామీ మేరకు పింఛను సొమ్మును పెంచామన్నారు. ఈ సందర్భంగా ముగ్గురికి వీల్ చైర్‌లు, ఒకరికి ట్రైసైకిల్, ఒక సీపీచైర్, ఒకరికి వాకర్, ఇద్దరికి వినికిడి యంత్రాలు ఎంఎల్‌ఏ చేతులమీదుగా అందచేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవోలు -1, 2 ఎస్.రాజేష్, గొర్రెల బాలయ్య, మండల తెదేపా అధ్యక్షుడు, ఇందుకూరి రామకృష్ణంరాజు, మండల జనసేన అధ్యక్షుడు తోట శ్రీను, ఉంగుటూరు ఎఎంసి అధ్యక్షుడు సూరత్తుల అయ్యప్ప, కూటమి నాయకులు కూనసాని నాగేశ్వరరావు, కొయ్య వెంకటసుబ్బారావు, నీటిసంఘం అధ్యక్షుడు దాట్ల రంగరాజు, హెచ్‌ఎం టి. శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిడమర్రు: మండలంలోని భవిత కేంద్రం వద్ద గురువారం దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు, ప్రత్యేక అవసరమైన ఉపకరణాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు పాల్గున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


జరీనా బేగాన్ని సత్కరిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం: జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పఠాన్ జరీనా బేగాన్ని ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సభ్యులు సత్కరించారు. దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ జరీనా బేగం జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 369 ర్యాంకు సాధించిందన్నారు. జేపీ యూత్ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థిని అక్షయను అభినందించారు. యూత్ అధికార ప్రతినిధి భద్రాచలం జ్యోతికుమార్ కుమార్తె అక్షయ పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులు సాధించింది. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ ప్రతినిధులు షేక్ ముస్తఫా, టిప్‌టాప్ బాజీ, షేక్ యాకూబ్, షేక్ ఆదిల్, ఎండీ నబీ, ఎండీ షాహీన్, షేక్ బాబుసాహెబ్, ఎండీ షఫీ, షేక్ రషీద్, షేక్ ముస్తాక్, షేక్ సురా సాహెబ్, సయ్యద్ సమీవుల్లాలు పాల్గొన్నారు.

'పది' విద్యార్థుల విజయఢంకా

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభా పాఠశాల విద్యార్థులు విజయఢంకా మోగించారని ప్రిన్సిపాల్ కాసర లక్ష్మీసరోజారెడ్డి అన్నారు. పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన 143 మంది విద్యార్థుల్లో 87 మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. కె.కువలేష్ 594 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలవగా, కె.హిమశ్రీ లలితాంబిక 592 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఉపాధ్యాయులు, తల్లితండ్రులు విద్యార్థులను అభినందించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఇంటర్న్ షిప్ విభాగం, ఓటిపి టెక్నాలజీస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పాస్ అయిన విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి కే విశ్వేశ్వరరావు తెలిపారు. 60 మందితో ప్రారంభించిన ఈ కోర్సులు ఇప్పటికే 30 మంది విద్యార్థులను ఎంపిక చేశామని, మరో 30మంది విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలకు స్వయంగా గాని లేదా 8125155788 ఫోన్ నెంబర్ ద్వారా వివరాలను పొందవచ్చన్నారు.

స్టార్ హోటల్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలోని టూరిజం శాఖ ఆదేశాల మేరకు కొత్తగూడెంలో స్టార్ హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన గురువారం దెందులూరు తహసీల్దార్ బి.సుమతి చేశారు. జాతీయ రహదారి ప్రక్కన కొత్తగూడెం ప్రాంతం అనుకూలంగా ఉండటంతో అక్కడి స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణారావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ హేమమాలిని, వీఆర్‌ఓ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్ర దాడులపై నిరసన జ్వాలలు


జంగారెడ్డిగూడెం: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


పోలవరం రూరల్: సంతాపం తెలుపుతున్న నాయకులు


బుట్టాయగూడెం: ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: పహల్గాం దాడి పిరికిపంద చర్య అని, కుల, మతాలు అడిగి మరీ కిరాతకంగా వ్యవహరించిన ఉగ్రమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణ నుంచి మసీదు సెంటర్, అక్కడి నుంచి కొత్త బస్టాండ్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ టెర్రరిస్టులు అతి దారుణంగా, కిరాతకంగా, సభ్య సమాజం తలదించుకునేలా హత్యాకాండ జరిపారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఘటనకు నిరసనగా గురువారం జంగారెడ్డిగూడెం బార్ మెంబర్స్ కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్ఆర్ మూర్తి, మోడేపల్లి నాగులు, పొన్నా లక్ష్మణరావు, పీవీ కృష్ణారెడ్డి, ఎన్‌వీబీఎల్ ఆచారి, సొబ్బన ఆనంద్, జువ్వల బాబూజీరావు, బండారు లతాకుమారి, వింజమూరి కిరణ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ ఏర్పాటు

పోలవరం రూరల్: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో హతమైన పర్యాటకులకు నాయకులు, ప్రజలు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గురువారం పోలవరం గ్రామంలో ఈవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఉగ్రవాదుల దాడి అమానుషం అని, పర్యాటకులపై ఈ విధంగా దాడి చేయడంపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విహార యాత్ర కోసం వెళ్లిన పర్యాటకులపై ఈ విధంగా దాడులు చేయడంపై నిరసన తెలుపుతూ ముందు ముందు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తెలగంశెట్టి ప్రసాద్, బొడ్డు కృష్ణ, కొణతాలప్రసాద్, కరిబండి నాగరాజు, బొరగం వెంకట లక్ష్మి, చీకట్ల సాయి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని ఖండిస్తూ ర్యాలీ

బుట్టాయగూడెం: కాశ్మీర్‌లో టూరిస్ట్‌లపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ కాశ్మీర్‌లో టూరిస్ట్‌లపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెల్లం రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరరావు, వెట్టి వీరయ్య, చుంద్రు బుల్లెమ్మ, మడకం భూలక్ష్మి, భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: జమ్ముకాశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ జంగారెడ్డిగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జయప్రకాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన వీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తూ, ఉగ్రచర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ దేశాన్ని అస్థిరపరిచేందుకు చేసిన కుట్రను భారతీయులు తిప్పికొడతారన్నారు. ఉగ్రవాదులు మరోమారు ఇటువంటి ఘాతుకాలకు పాల్పడకుండా సరైన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పాదిలి ఫణి, వేములపూడి నాగరాజు, షేక్ ముస్తఫా, ఎం.ఎస్., కొండేటి నాగు, బొంగు నాగేశ్వరరావు, శివారెడ్డి హరికృష్ణ, భద్రాచలం కుమార్, దాసు పండు, నాగరాజు, అన్నంరెడ్డి రాజు, అగస్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో

భాస్కర్ ట్రావెల్స్‌లో పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు. ఉగ్రమూకలు దాడులు తెగబడటం తీవ్రంగా కలిచివేసిందని ట్రావెల్స్ యజమాని ఇమ్మడి బాల భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా చేతికి నల్లరిబ్బన్లు కట్టుకని నిరసన తెలిపి, మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇమ్మడి బాల భాస్కర్, కనుమూరి హారిక, పట్నాల వరలక్ష్మి, ఆంధ్రూ సంధ్యా, నీలిమ, పట్నాల భవాని, ప్రవల్లిక, గునకల మల్లీశ్వరి పాల్గొన్నారు.

సర్జికల్ స్ట్రైక్ చేపట్టాలి

కొయ్యలగూడెం: పహల్గాం టూరిస్టులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొయ్యలగూడెంలో గురువారం రాత్రి ఆందోళన నిర్వహించారు. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో గణేష్ సెంటర్‌లో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఎండగట్టి పాకిస్తాన్ భరతం పట్టాలని నినాదాలు చేశారు. మృతుల కుటుంబాలకు భారతదేశం అండగా నిలవాలన్నారు. పీఓకేలో మరోసారి సర్జికల్ స్ట్రైక్ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గుణ్ణంపల్లి–మారంపల్లి లైన్‌లో ఈ నెల 25వ తేదీన మరమ్మతులు చేపడుతున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మారంపల్లి, కప్పలకుంట, లక్ష్మీనగర్, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం


ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీలను సన్మానించారు. వైస్ ఎంపీపీ నరెడ్ల వెంకట సుబ్బారావు పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల పనితీరు, విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న గ్రామస్తులు

టి.నరసాపురం: మండలంలోని తిరమలదేవిపేటకు హైస్కూల్ మంజూరైంది. గ్రామస్తులు నూతనంగా మంజూరైన హైస్కూల్ భవన నిర్మాణ నిమిత్తం గురువారం శంకుస్థాపన పూజలు నిర్వహించారు. హైస్కూల్ మంజూరు కావడంతో చిన్నారులు గ్రామంలోనే పదో తరగతి వరకు విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు కూటమి నాయకులు, తదిరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీనివాసుని గరుడోత్సవం


గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీనివాసునికి గరుడోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణం నిర్వహించిన మరుసటి రోజు రాత్రి ఈ వేడుకను నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. ఉభయ దేవేరులతో స్వామి వారిని గరుడ వాహనంలో ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధితోనే స్వరాజ్యం సాధ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీకృష్ణ

చింతలపూడి: పల్లె ప్రాంతాలు అభివృద్ధి సాధించిన నాడే గ్రామ స్వరాజ్యం సాధించినట్లు అని ఎంపీడీఓ మురళీకృష్ణ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రగడవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఎం రత్నకుమార్, డి.శ్యామలరావు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సువార్త ప్రకటన విస్తృతం కావాలి



సభలో మాట్లాడుతున్న సువార్తీకులు

దెందులూరు: సువార్త ప్రకటన విస్తృతం కావాలని సిస్టర్ గ్రేస్ రాణి అన్నారు. దెందులూరు యందం వారివీధిలో మూడో రోజు రక్షణ సువార్త సభలు జరిగాయి. దేవుని ఆజ్ఞలు అనుసరించేలా ప్రజలందరినీ సమయత్వం చేసేందుకు రక్షణ పొందేందుకు జీవన విధానాన్ని మెరుగుపరిచే కోరడం చాలా ముఖ్యమని సిస్టర్ గ్రేస్ ర్యాలీ తెలిపారు. అనంతరం పోతునూరు పాస్టర్లు ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

దెందులూరు: రీ సర్వేతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని దెందులూరు తహసీల్దార్ సుమతి తెలిపారు. గురువారం మండలం రీసర్వేపై విఆర్వోలు, వీఆర్ఏలు, మండల సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాము సేవలు మరువలేనివి

దెందులూరు: ఉపాధ్యాయ వృత్తికి దివంగత ప్రధానోపాధ్యాయులు పూర్వశెట్టి రాము వన్నె తీసుకువచ్చారని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీవీ రమణమూర్తి, జరజాపు రంగారావు అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రాము సంస్మరణ సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధిగా హెచ్‌ఎంగా చెరగని ముద్ర వేశారన్నారు. ఆధ్యాత్మిక రంగానికి కూడా దశాబ్దాలు సేవలందించారన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా డైరెక్టర్, మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

దెందులూరు: వేసవిలో ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని పోతునూరు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం పోతునూరు వైద్యశాలలో వడ దెబ్బ బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన సూచనలు ఆహారం, విశ్రాంతి పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈ ఓ.హరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భీమడోలు: ప్రతి ఏటా వేసవిలో బాటసారులు, భక్తుల దాహార్తిని తీర్చుతున్న వైఎస్సార్ సీపీ వీరాభిమాని రేవాడ శ్రీనివాసరావు సేవలు ఆదర్శప్రాయమని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ వీరాభిమాని రేవాడ శ్రీనివాసరావు మహానేత సీఎం వైఎస్సార్ పేరుతో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.